**మల్లాది వెంకటకృష్ణమూర్తి**

**కథానిక**

# ప్లేగియారిజం

కథలంటే నాకు కొద్దోగొప్పో ఆసక్తి వుంది. అలా అని ప్రతి కథా చదవను. నిజానికి అంత ఓపిక, సమయం లేవు నాకు. అయితే సాంఖ్యాయన శర్మ పేరు కోసం చూస్తాను ఏదయినా పత్రిక తిరగేస్తూంటే. అందులోని విషయసూచికలో ఆ పేరు కనబడితే ముందర ఆకథ చదువుతాను అతనికథలు నాకు బావుంటాయి. నిజానికి అనేకమంది రచయితల కథలు బావుంటాయి. అయితే సాంఖ్యాయన శర్మతో నాకు ఓసారి పరిచయం జరిగింది. కాబట్టి అతని కథలు చదువుతాను

ఒకవ్యక్తి రచయిత అని తెలిసాక అతని కథలు చదవటంలో ఆసక్తి వుంటుందనుకుంటాను. అందుకే ఓ స్నేహితుడింట్లో, అతను స్నానం చేస్తూంటే బల్లమీది ఓ మాసపత్రిక తిరగేస్తూంటే, సాంఖ్యాయనశర్మ పేరు కనబడితే ఆ కథ చదివాను.

కథ పేరు 'అంకితం'. చక్కటి ఎత్తుగడ, మంచి ముగింపుతో ఆ కథ బాగానే వుంది.

నా స్నేహితుడు స్నానం అయ్యాక రావడంతో పత్రిక పక్కన పడేసి నే వచ్చినపని గురించి మాట్లాడసాగాను

నెల తర్వాతనుకుంటాను, ఆఫీస్‌లో లంచ్ అవర్‌లో ఆ నెలలో విడుదలయిన మాసపత్రికని తిరగేస్తూ వుత్తరాల శీర్షికలో సాంఖ్యాయనశర్మ కథ గురించిన వుత్తరాలకోసం చూసాను. సాధారణంగా అతని కథలు బావుళ్ళేవనే వుత్తరాలు అరుదుగా ప్రచురిస్తూంటారు.

ఒకటి రెండు వుత్తరాల్లో అతని కథ గురించిన ప్రస్తావనవుంది. 'అంకితం' బావుందని రాసారు. మూడో వుత్తరంలోని ఘాటయిన విమర్శ చదివాను.

సాంఖ్యాయన శర్మగారు రాయగా మీరు ప్రచురించిన కథ 'అంకితం' చదివాం. ఆంధ్రవాణి వారపత్రికలో పద్నాలుగు వారాలపాటు సీరియల్‌గా ప్రచురింపబడ్డ మరో రచయిత నవల, "సమర్పణ"కి ఇది సంక్షిప్త రూపం ఇచ్చిన కాపీ కథ. ఆ నవలని యధాతథంగా కథగా క్లుప్తంగా రాసారీ వర్థమాన రచయిత. ఇది మీరు కూడా గుర్తించకుండా ప్రచురించడం శోచ

శయం. పత్రికాముఖంగా శర్మగారిచేత ఈ చౌర్యానికి సంజాయిషీ ఇప్పించవలసిందిగా కోరుతున్నాం. ఇకమీదట ఇలా జరగకుండా చూడవలసిందిగా కూడా కోరుతున్నాం.

ఏలూరు నుంచి నలుగురు కలిసి రాసారు ఆ వుత్తరం అంత ఘాటుగా లేకపోయినా మరో రెండు మూడు వుత్తరాల్లో సాంఖ్యాయనశర్మ కథ గురించి రాసారు మరో వారపత్రికలో ప్రచురింపబడ్డ "సమర్పణ" అనే నవలకు, ఆ కథకూ పోలికలున్నట్లుగా.

నాకు అతను గుర్తుకు వచ్చాడు. "ఇతనింతేనా" అనిపించింది ఒక్కక్షణం. రచయితగా అతనిమీదవున్న గౌరవం చాలా తగ్గిపోయింది నాకు.

ఆ వుత్తరాల శీర్షిక పేజీ తిప్పాను. పక్కపేజీలో 'సాంఖ్యాయనశర్మ సంజాయిషీ' అనే శీర్షికకింద అతని సంజాయిషీ ప్రచురించారు అతను ఎలా సమర్ధించుకుంటాడాఅని వుత్సాహంగా చదవసాగాను. తను ఆ నవల అసలు చదవనే చదవలేదని రాస్తాడనుకున్నాను. దొంగతనం నేర్చినవాళ్ళు అబద్ధం ఆడటానికి వెనుదీయరు.

కాని అలా జరగలేదు. ముందర సంపాదకులు రాసిన నాలుగుముక్కలు వున్నాయి.

ఏలూరునుంచి నలుగురు పాఠకులు రాసిన వుత్తరాన్ని గతనెల ప్రచురించిన 'అంకితం' కథా రచయిత సాంఖ్యాయనశర్మకి పంపగా, అయన బదులుగా రాసిన సంజాయిషీని యధాతథంగా దిగువ ప్రచురిస్తున్నాం. సం॥

పాఠకులందరికీ వందనాలు. గత నెల ఇదే మాసపత్రికలో ప్రచురింపబడ్డ నా రచన "అంకితం" ఓ వారపత్రికలో ప్రచురింపబడ్డ సీరియల్ నవల "సమర్పణ"కి కాపీ అని ఏలూరునుంచి నలుగురు పాఠకులు రాసిన వుత్తరం మీరు చదివేవుంటారని భావిస్తాను.

వాళ్ళు రాసిందాంట్లో నిజం వుంది. ఆ కథని కాపీకొట్టే రాసాను నేను కావాలని. ఆ నవల చదివాను. అయితే అది "ది డెడికేషన్" అనే ఆంగ్లనవల (రచయిత: జేమ్స్ ఫాన్స్, ప్రచురణ. ఏప్రియల్ 1972. లండన్ నుంచి ట్వింకిలిన్ కంపెనీవారి ముద్రణ)కి కాపీ. ఆ నవల నేను నాలుగు సంవత్సరాలక్రితమే చదివాను. అందుకే కావాలని ఈ కథ ద్వారా ఆసంఘటనని మీ దృష్టికి తీసుకురాదలచాను ఎందుకంటే, ఆ వారపత్రికకి జరిగింది వివరిస్తూ నేను వుత్తరం రాసినా అది ప్రచురించలేదు.

సెలవు,

సాంఖ్యాయన శర్మ

లంచ్ అవర్ అయ్యాక మళ్ళీ పని మొదలుపెట్టేవాకా ఆ వుత్తరం గురించే ఆలోచిస్తూండి పోయాను.

—o—